క్లుప్తంగా

సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం



వ్రతం చేస్తున్న భక్తులు

తుర్కయంజాల్: పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో రమా సమేత వీర వేంకట సత్య నారాయణ స్వామి సామూహిక వ్రతం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు తూళ్ల నర్సింహ గౌడ్ తెలిపారు.

సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి



పత్తి సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మాడ్గుల: అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి వస్తుందని నోడల్ ఆఫీసర్ ఆమత అన్నారు. గురువారం మండల కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట పరిశోధన ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగుపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయడం వలన కూలీల ఖర్చు, పంటకాలం తగ్గుతుందని, అదే సమయంలో దిగుబడి అధికంగా వస్తుందని పేర్కొన్నారు. యాంత్రీకరణ సాధ్యం అవుతుందని, కావున రైతులు ఈ విధానంలో సాగు చేయాలని సూచించారు. ఈ పద్ధతి వలన గులాబీ రంగు పురుగు నుంచి పంటను కాపాడుకోవచ్చునని, దీని నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. శాస్త్రవేత్తలు చంద్రకాంత్, విజయ్, గౌతమ్, హరి, ఏఓ ఆరుణ, ఏఈఓ జోత్స్న, వాహిని, భార్గవ్, ప్రియాంక, రాజేష్ పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం



శ్రీకాంత్‌కు చెక్కు అందజేస్తున్న రాములు

ఆమనగల్లు: కానూర్‌లో ఐటీ చదువుతున్న శ్రీకాంత్‌కు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు రూ.40వేలు ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధి శంకరకొండతండాకు చెందిన నిరుపేద విద్యార్థి నేనావత్ శ్రీకాంత్.. ఐటీ మొదటి సంవత్సరం పూర్తిచేశాడు. ఆర్థిక ఇబ్బందుల వలన రెండో సంవత్సరం ఫీజులు కట్టేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రాములు.. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో విద్యార్థికి రూ.40 వేల చెక్కును అందజేశారు. చదువు పూర్తయ్యేవరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మానయ్య, స్థానిక నాయకులు ఆంజనేయులు, నేనావత్ పత్యా, రాంజీ, శేఖర్‌రెడ్డి, జగ్రాం, చందునాయక్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్‌లో గురువారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ ఏర్పడి వ్యవసాయబోర్లు మొరాయిస్తున్నాయని రైతులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన స్పందించి స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ మంజుల, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

షాబాద్: పేద విద్యార్థులకు దాతల ప్రోత్సాహం ఎంతో అవసరమని హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1984–85లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలలోని విద్యార్థులకు అన్ని రకాల క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దోస్వాడ నర్సింలు, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సంఘమేశ్వర్‌రెడ్డి, కిరణ్మయి, నాగిరెడ్డి, గ్లోరీ, శోభారాణి, మొగులయ్య, బాలకృష్ణ, శీతాబాయి, లలిత, మంజుల, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి రక్షణ

- నిర్మాణ రంగంలో కార్మికులకు బాసట
- కన్‌స్ట్రక్షన్ పరిశ్రమల్లో అనేక అవకాశాలు
- ముగిసిన న్యాక్ శిక్షణ తరగతులు
- ప్రయోజనం పొందనున్న కూలీలు

కడ్తాల్: విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందిన రంగాల్లో నిర్మాణ రంగం ఒక్కటి. ఇందులో నైపుణ్యత, విజ్ఞత, ఉన్నతమైన, ఉత్తమమైన నైపుణ్యం కలిగిన వారికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తుంటాయి. ప్రస్తుతం ఈ వృత్తిలో దేశవ్యాప్తంగా సుమారు ఏడు కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికులు వృత్తిలో నైపుణ్యం లేనివారే ఉన్నారు. ఇప్పటి వరకు ఈ రంగంలో సంప్రదాయక మేస్త్రీల వద్ద శిక్షణ పొందిన వారే అధికంగా ఉన్నారు.

నిపుణులకు అవకాశాలు

మేస్త్రీల వద్ద శిక్షణ పొందిన వారితో భారీ ప్రాజెక్టులను నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో అనతి కాలంలో పూర్తిచేయడం కొంచెం కష్టమైన పనేనని, శిక్షణ పొందిన వారు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నిపుణులు స్పష్టంచేస్తున్నారు. నిపుణులైన ఎలక్ట్రీషియన్లు, వెల్డర్లు, తాపీ మేస్త్రీలు, ప్లంబర్లు, వడ్రంగులు, పెయింటర్లు, బార్‌బెండర్లకు ఈ రంగంలో ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ రంగంలో నైపుణ్యం కలిగిన వ్యక్తులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన కార్మిక, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ

న్యాక్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ ద్వారా గుర్తింపు పొందిన భవన నిర్మాణ కార్మికులకు, ఎంపిక చేసిన ప్రదేశాల్లో పక్షం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిక్షణకు నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారే అర్హులు. ప్రస్తుతం శిక్షణ మండల పరిధి వంపుగూడ గ్రామంలో ఈ నెల 1న ప్రారంభమై 17వ తేదీన ముగిసింది. ఇందులో 30 మంది శిక్షణ పొందారు. గడిచిన 15 రోజుల్లో తాపీ మేస్త్రీలకు, కార్మికులకు ప్లాస్టింగ్, లేఅవుట్ మార్కింగ్, భవనం నిర్మాణంలో సిమెంట్, ఇటుక, కంకర, స్టీల్ సామగ్రి ఏ మేరకు వినియోగించాలో తదితర అంశాలపై మెలకువలు నేర్పించారు. దృఢంగా భవనాలను ఏ విధంగా నిర్మించాలి, భవనం పూర్తి చేయడానికి ఎంత సమయం, మెటీరియల్ ఎంత, ఖర్చు, రక్షణ సూత్రాలు ఇలా నిర్మాణ రంగంలో కావాల్సిన నైపుణ్యత, వృత్తిని మెరుగు పర్చుకునే అంశాలపై వివరించారు.

తర్ఫీదు బాగుంది



శిక్షణ కార్యక్రమంలో చాలా విషయాలు నేర్చుకున్నాను. భవన నిర్మాణంలో సామగ్రి ఉపయోగించే విధానం, ఇసుక, కంకర, సిమెంటు మిశ్రమం చేయుట గురించి చాలా చక్కగా వివరించారు. ఎలైన్‌మెంట్, పాయింటింగ్, ప్లాస్టరింగ్, క్యూరింగ్, మూసలో పోయుట ఆధునిక పద్ధతుల్లో వివరించడంతో పాటు, ప్రాక్టికల్ చేయించారు. – యాదయ్య, కార్మికుడు, వంపుగూడ

కొత్త విషయాలు నేర్చుకున్నా



చాలా కాలంగా మేస్త్రీగా పనిచేస్తున్నాను. ఇప్పుడు న్యాక్ ఇస్తున్న శిక్షణలో ఇంటి నిర్మాణంలో నూతన పద్ధతులు నేర్చుకోగలిగాను. యాంత్రిక వినియోగం తెలుకోగలిగాను. ఇవి భవిష్యత్తులో ఎంతోగానో ఉపయోగపడతాయి. శిక్షణ పొందిన కార్మికులకు ప్రభుత్వం రుణాలు ఇప్పించి, స్వయం ఉపాధి కల్పించాలి. – రాజు, భవన నిర్మాణ కార్మికుడు, వంపుగూడ

బహుళ ప్రయోజనాలు



శిక్షణ పొందిన కార్మికులకు నిర్మాణ రంగంలో నూతన ఒరవడిపై అవగాహన, నైపుణ్యం పెరుగుతుంది. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చాం. దీంతో వారికి ఈ రంగ పరిశ్రమల్లో అనేక అవకాశాలు లభిస్తాయి. చదువు మధ్యలో ఆపేసిన వారికి, నిరుద్యోగులకు న్యాక్ ఆధ్వర్యంలో నిర్మాణ రంగంలో ఉపయోగపడే వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. – అంజయ్య, న్యాక్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

పోలీసులంటే భయం వీడండి

గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు

యాచారం: పోలీసులంటే ప్రజలు భయం వీడాలని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తమతో చెప్పాలని గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు కోరారు. విజబుల్ పోలీసింగ్‌లో భాగంగా గురువారం తాటిపర్తి గ్రామంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. అనంతరం స్థానికులతో సీఐ మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా, అత్యవసర సమయాల్లో 100కు కాల్ చేయాలని చెప్పారు. వాహనాలకు అన్ని రకాల పత్రాలు ఉండాలని, మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

వాల్మీకి జీవితం లోకానికి ఆదర్శం



తుర్కయంజాల్: పుర కార్యాలయంలో.. వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ తదితరులు

మహర్షి జయంతిలో వక్తలు

ఆమనగల్లు/తుర్కయంజాల్: రామాయణం రచించిన వాల్మీకి జీవితం లోకానికి ఆదర్శమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్, తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కే.అమరేందర్ రెడ్డిలు అన్నారు. ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి ఆలయంలో శ్రీనివాస్‌రెడ్డి, తదితర నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ మండల ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మహేశ్, నాయకులు రేణురెడ్డి, కృష్ణయ్య, రాజు,



ఆమనగల్లు: గట్టుప్పలపల్లిలో.. వాల్మీకి మహర్షి ఆలయంలో పూజలు

ప్రశాంత్‌రెడ్డి, రాజేందర్, రాజశేఖర్‌శెట్టి, అంజయ్య, జంగయ్య, రమేశ్, కిషన్, శేఖర్, అశోక్, శ్రీను, కొండల్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కే.అమరేందర్ రెడ్డి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీనివాసులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఇబ్రహీంపట్నం: ఎలిమినేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మిన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్స్) పొందిన 29 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, గుర్తింపు కార్డుతో పాటు, పాఠశాలకు 15 కుర్చీలను గ్రామానికి చెందిన మంఖాల శేఖర్‌రెడ్డి, బజారు భిక్షపతి, గౌట్టం శ్రీశైలం గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయురాలు సూదిని అరుణ, వెంకటయ్య, రాజేందర్, సుజాత, వరలక్ష్మి, బాలశౌరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న దాతలు

పార్కు స్థలాలు కబ్జా

- ఫిర్యాదులున్నా చర్యలు శూన్యం
- బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: కోట్ల రూపాయలు విలువ చేసే పార్కు స్థలాలను మేయర్ భర్త కబ్జాచేసి, సొమ్ముచేసుకుంటున్నారని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 31వ డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో పదికి పైగా పార్కులకు స్థలాలు వదిలిపెట్టారని పేర్కొన్నారు. అలా వదిలిన స్థలాలను మేయర్ భర్త.. టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తూ.. విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు. ఇందుకు తగిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. కబ్జా గురించి ఫిర్యాదులు అందినా.. మేయర్ ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. టీపీఓను ఇతర అధికారులను గుప్పెట్లో పెట్టుకుని మేయరే కబ్జాలకు తెరతీశారని విమర్శించారు. సంబంధిత అధికారులు కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తదుపరి చేపట్టే కార్యక్రమాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇదే విషయమై అడిషనల్ కలెక్టర్, సీడీఎంఏ, రాష్ట్ర రిజిస్ట్రార్ స్టాంప్ ఉన్నతాధికారులు, కమిషనర్, మేయర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఉన్నారు.

జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి

బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము

షాబాద్: ప్రధాని జీవిత బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రధాని జీవిత బీమా చేసుకున్న లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలకు దరఖాస్తులు చేసుకోవడంతో రూ.2లక్షల బీమా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రమేశ్, నరేశ్, సాయి, ఎస్‌బీఐ సీఎస్పీ నిర్వాహకులు శివరాజ్‌గౌడ్, రమేశ్ తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు బీమా పత్రాలు అందజేస్తున్న రాము

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మంచాల: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కార్యదర్శి ఏర్పుల తరంగ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజురీయంబర్స్‌మెంట్ ఇవ్వక ఇబ్బందులకు గురి చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. దీని కారణంగా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసి, సర్టిఫికెట్లు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం వెంటనే పెండిగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని వెల్లడించారు.

కల్లుగీత కార్మికులకు లైసెన్సు ఇవ్వాలి

మాడ్గుల: అర్హులైన కల్లుగీత కార్మికులకు లైసెన్సులు మంజూరు చేయాలని గౌడ యువజన సంఘం మండల నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లైసెన్స్ లేని కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే, ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేసియా పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. కార్మికులందరికీ లైసెన్సులు మంజూరు చేసి అండగా నిలవాలని, కాటమయ్య రక్షణ కిట్లను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్, యువజన నాయకులు రమేష్ గౌడ్, కరుణాకర్ గౌడ్, శివ గౌడ్, వెంకటయ్య, సత్యం గౌడ్ పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకా తప్పనిసరి



ఆవుకు టీకా ఇస్తున్న డాక్టర్ అగ్నివేశ్

ఆమనగల్లు: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ చింతోజు అగ్నివేష్ అన్నారు. మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం పాడిపశువులకు ఉచితంగా టీకాలు వేశారు. గ్రామంలో మొత్తం 363 ఆవులు, 3 పాడి పశువులకు టీకా వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సులేమాన్, యాదయ్య, పాలాక్ష, బురానొద్దీన్, గోపాలమిత్రలు హరీశ్, రమేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

పట్నం మండలానికి ఆరుగురు కొత్త టీచర్లు

ఇబ్రహీంపట్నం: డీఎస్సీ 2024లో ఎంపికైన నూతన ఉపాధ్యాయుల్లో ఆరుగురిని ఇబ్రహీంపట్నం మండలానికి కేటాయించారు. నాగన్‌పల్లి ఎంపీహెచ్‌ఎస్‌కు స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, తెలుగు, హిందీ పండిట్ పోస్టులకు, ఇబ్రహీంపట్నం ఉర్దూ మీడియం ఎస్‌జీటీ(ఉర్దూ), బొంగ్లూర్ ఎంపీపీఎస్‌కు ఎస్‌జీటీ, రాయపోల్ ఎంపీపీఎస్‌కు ఎస్‌జీటీ (స్పెషల్ టీచర్) పోస్టులకు కొత్త ఉపాధ్యాయులను విద్యాశాఖ కేటాయించింది. దీంతో వారు గురువారం విధుల్లో చేరారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి



కార్మికులతో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అధికారులు, నాయకులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: వృత్తి నైపుణ్య శిక్షణతో కార్మికులతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి చల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధి వంపుగూడలో 15 రోజులుగా ప్రభుత్వం నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగిన భవన నిర్మాణ రంగ కార్మికుల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, విద్యలో అంతగా రాణించలేని వారు సైతం, తమలోని సృజనాత్మకతతో వివిధ రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. మేస్త్రీలు మొదలు ఎలక్ట్రీషియన్లు, ఇంటి నిర్మాణంలో కీలక పాత్ర పోషించే వివిధ వృత్తుల వారు ఉన్నతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మార్పులకు అనుగుణంగా తమ వృత్తులను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య మాట్లాడుతూ తాపీ మేస్త్రీలతో పాటు, చదువు మధ్యలో ఆపేసిన నిరుద్యోగ యువతకు నిర్మాణ రంగంలో రాణించేలా, నచ్చిన వృత్తిలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300లు ప్రోత్సాహకంగా అందజేస్తున్నామని చెప్పారు. సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- అస్తవ్యస్తంగా ఇందిరమ్మ కాలనీ రహదారి
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ రాజ్యంలో ఆమె పేరిట ఉన్న కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఔటర్‌రింగ్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న ఇందిరమ్మ కాలనీకి రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదే ప్రాంతంలో ఆదర్శ పాఠశాల ఉండగా.. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఆదిబట్ల ప్రస్తుతం హైటెక్‌నగరంగా పేరు ప్రఖ్యాతులు గాంచింది. ఓఆర్‌ఆర్‌కు ఆనుకొని ఉన్న నగరంగా గుర్తింపు పొందింది. ఆదిబట్ల మొదటి వార్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీకి మాత్రం సరైన రోడ్డు మార్గం లేదు. ఈ కాలనీలో 300 మందికి పైగా జనాభా ఉంది. మరో 600 మందికి పైగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు.

పదేళ్ల క్రితం ఫార్మేషన్ రోడ్డు

పదేళ్ల క్రితం ఫార్మేషన్ రోడ్డు వేశారు. కానీ బీటీ వేయకుండానే వదిలేశారు. పది సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతుకు నోచుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. వాహనాల రాకపోకలు కాదుకదా.. కనీసం కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ కాలనీకి రోడ్డు దిక్కులేదని వాపోతున్నారు.



గుంతల మయంగా ఇందిరమ్మ కాలనీ రోడ్డు

గుంతల రోడ్డుతో అవస్థలు



గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్నాం. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాలనీకి వచ్చిపోవాలంటే కి లో మీటరు నడవాల్సిందే. అధ్వాన్న రోడ్డులో కనీసం మట్టి పోసే వారు లేరు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. – మోహన్‌రెడ్డి, బొంగ్లూర్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఇందిరమ్మ కాలనీ రోడ్డు గురించి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశాం. మరోసారి మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డితో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. రహదారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – లావణ్య, కౌన్సిలర్

విద్యార్థులకు షూ, టై అందజేత

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం కాంగ్రెస్ నాయకుడు ఎండీ మున్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ, టైలతో పాటు పాఠశాలకు వంట సామగ్రి, బ్యాండ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, నాయకులు మల్లయ్య, వాహెబ్, సత్తిరెడ్డి, యాదయ్య, లక్ష్మయ్య, సయీద్, చెన్నయ్య, అంజద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.



షూ, టైలను పంపిణీ చేస్తున్న నాయకులు